# తరుముకొస్తున్న కరువు - రైతాంగ దుస్థితి

## ప్రభుత్వాల నిర్లక్ష్యం

**'పైరుపచ్చ** విప్లవ' స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న ఈ సందర్భంలోనే, దీర్ఘకాలంగా వెంటాడుతున్న కరువుకు తోడు వ్యవసాయ ఉత్పాదకాల ధరలు భారీగా పెరుగుదల; ప్రభుత్వసంస్థల ద్వారా పంటల కొనుగోలు కుదింపు, మార్కెటింగ్ సౌకర్యాల వంటి ప్రభుత్వ ఎత్తివేత చర్యలతో 70 శాతం రైతాంగం తీవ్ర దుస్థితినెదుర్కొంటున్నారు. ఈ వివరాలను తెలిపే నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్ఓ) నివేదిక ఇటీవలే విడుదలైంది.

అధిక నీటి వినియోగం, రసాయన ఎరువుల వాడకాలపై అధికంగా ఆధారపడటం ఫలితంగా అసమగ్ర వ్యవసాయ అభివృద్ధితోపాటు సాగునీటి సదుపాయమున్న కొన్ని పరిమిత ప్రాంతాలపై కేంద్రీకరించి విశాల వ్యవసాయ ప్రాంతాలను నిర్లక్ష్యపరచటమనేవి ఈ పైరుపచ్చ విప్లవ దుష్ఫలితాలుగా వున్నాయి. నూతన ఆర్థిక విధానాల అమలుతో అప్పటివరకు వ్యవసాయానికి ఇచ్చిన సంస్థాగత రుణాలను, వ్యవసాయ ఉత్పాదకాలలో సబ్సిడీలను, ప్రభుత్వ సేకరణ వంటి కనీసపాటి చర్యలను కూడా ఉపసంహరించటం; వ్యవసాయ మార్కెట్టు యార్డుల ప్రైవేటీకరణ మొదలైన చర్యల ఫలితంగా రైతాంగ దురవస్థ మరింత తీవ్రమైంది.

ఆర్థిక మీటల ద్వారా రైతాంగాన్ని తమ భూముల నుండి గెంటివేసి కార్పొరేటు / కాంట్రాక్టు వ్యవసాయానికి స్వాధీనం చేయటమే ఈ విధానాల ఉద్దేశ్యమనేది నిస్సందేహం.

దేశంలోని 29 రాష్ట్రాలకుగాను ప్రత్యేకించి 18 రాష్ట్రాలలో వరుసగా రెండో సంవత్సరం కూడా కరువు వెంటాడు తూండటంతో రైతుల దురవస్థ మరింత అధికమైంది. గత వంద సంవత్సరాలలో ఈవిధంగా జరగటం ఇది నాలుగోసారి కాగా, 1986, 87 సం॥లలో చివరిసారిగా ఇలాంటి కరువు సంభవించింది.

మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో ఈసారి కూడా రుతుపవనాలు తగిన ప్రభావం చూపలేదు; విఫలమయ్యాయి. పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్, కర్నాటక మరియు బావుల ద్వారా వ్యవసాయం సాగించే ఒడిషా తీరప్రాంతంలో రుతుపవనాల ప్రభావం చాలా స్వల్పంగా వుంది.

వరుసగా రెండు సంవత్సరాలు కరువుబారిన పడటంతో, బుందేల్‌ఖండ్ ప్రాంతంలో రైతులు, వారి కుటుంబాలు తీవ్ర క్షామ పరిస్థితులను ఎదుర్కొన్నారు. 36 శాతం గ్రామాలలో ఒక్కో గ్రామంలో కనీసం ఒక ఆకలిచావు సంభవించింది; 86 శాతం కుటుంబాలు పప్పుధాన్యాలు, పాల వాడకాన్ని రద్దుచేసుకున్నాయి; 67 శాతం కుటుంబాలు రోజుకు రెండుపూటలా తినగల పరిస్థితిలేదు; 24 శాతం కుటుంబాలు తమ పిల్లలను కూలీ పనులకు పంపిస్తున్నాయి; 97 శాతం రైతులు తమ అప్పులు పెరిగాయని చెప్పగా, 87 శాతంమంది వాటిని ఏవిధంగానూ తిరిగి చెల్లించగలిగిన స్థితిలో లేరు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం ప్రకారం ఉపాధిలేని ప్రతి ఒక్కరికీ 150 పనిదినాలు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ, సగటున 10 పనిదినాలు కూడా కల్పించలేదని సర్వే నివేదిక వెల్లడి చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో పశువులకు మేత, గొట్టపు బావుల మరమ్మత్తులు, వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అత్యవసర సరుకుల పంపిణీ వంటి తక్షణ ఉపశమన చర్యలను చేపట్టటంలో ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాయి.

ఈ కరువు భూతం ఉత్తరప్రదేశ్‌లోని 75 జిల్లాలకుగానూ 50 జిల్లాలను కబళించింది. ఆ జిల్లాలలో 60 శాతం అంతకంటే తక్కువ వర్షపాతం నమోదైంది. గత సంవత్సరం శిస్తు వసూళ్ళను రాష్ట్ర ప్రభుత్వం 2016 మార్చి వరకు నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సంవత్సరం ఇంకా కరువు సహాయచర్యలు చేపట్టాల్సి వుంది.

ఒడిషాలో గతంలో బలహీన రుతుపవనాల కారణంగా చావులు సంభవించటం అనేది అరుదైన విషయంగా వుండేది. ఈ సంవత్సరం 90 మంది రైతులు గత 3 నెలల కాలంలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. సంస్థాగత రుణసౌకర్యం లేకపోవటం, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దోపిడీ, అరాకొరా వర్షపాతం రైతుల జీవితాలను ఛిద్రం చేశాయి.

వాయవ్య భారతదేశంలో – పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌లలో అతితక్కువ వర్షపాతం నమోదైంది. పంజాబ్‌లో పత్తి రైతులు, ఈ సీజన్‌లో తమ పత్తిపంటలో తెల్లదోమ ఫలితంగా 40 శాతం నాశనమవటంతో పెద్దఎత్తున నష్టపోయారు.

రుతుపవనాలు బలంగా లేకపోయిన కారణంగా, మధ్యప్రదేశ్ రాష్ట్రంలో పంటకొచ్చిన సోయా కంకుల్లో గింజలు లేకపోవటంతో ఆ పంట నిరుపయోగమైంది. మొదటిసారిగా పసుప్పచ్చ తెగులు పంటను మొత్తంగా పాడుచేసింది. ఆ రాష్ట్ర ప్రభుత్వం 51 జిల్లాలకుగాను 40 జిల్లాలను కరువుపీడిత ప్రాంతాలుగా ప్రకటించింది. మధ్యప్రదేశ్‌లో వ్యవసాయం ప్రధానంగా వర్షాధారితంగా వుంది. రుతుపవనాలు బలహీనంగా వుండి, వర్షాలు లేకపోవటంతో భూగర్భజలాల నీటిమట్టం పడిపోవటం, విద్యుదుత్పత్తి కొరతలు కరువు కష్టాలను మరింత అధికం చేశాయి.

ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం 50 శాతం పంట నష్టం జరిగిన ఆ రాష్ట్రంలోని 117 తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించింది.

నిర్దిష్టకాలానికి క్రమం తప్పక కరువునెదుర్కొంటూ వున్న రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలోనూ ఈ కరువు పరిస్థితి మరింత తీవ్రంగా వుంది.

ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా గత నాలుగైదు సంవత్సరాలుగా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సంవత్సరం సెప్టెంబర్‌తో ఖరీఫ్ సీజన్ ముగిసింది. 42.56 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగుకావాల్సి ఉండగా 9 లక్షల హెక్టార్లలో విత్తనాలే పడలేదు. రాయలసీమ కరువుతో అల్లాడుతున్నది. కృష్ణాడెల్టా క్రింద గుంటూరు, ప్రకాశం, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలలో 13.07 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా 8.07 లక్షల ఎకరాల్లోనే పంటలు వేశారు. కృష్ణా బ్యారేజ్ కుడి-ఎడమ కాల్వలకు సాగునీరు విడుదల చేయకపోవడం వలన 90% రైతులు వేలాది రూపాయలు ఖర్చుపెట్టి బోర్లపై ఆధారపడి పంటలు వేశారు. భూగర్భజలాలు అందక 4 లక్షల ఎకరాల్లో వేసిన పంటలకు తీవ్రనష్టం జరిగింది. దుర్భిక్ష పరిస్థితులు ఒకవైపు ఇలా వుండగా నవంబర్‌లో కురిసిన భారీవర్షాలకు లక్షలాది ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. పనులు దొరక్క, కుటుంబాలు గడవక పొట్ట నింపుకోవటానికి లక్షలాది గ్రామీణ ప్రజలు వలసలు పోతున్నారు. త్రాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. పశువులను పోషించలేక వాటిని కబేళాలకు తరలిస్తున్నారు.

కరువును ఎదుర్కోవటంలో, సహాయకచర్యలు చేపట్టటంలో తెలుగుదేశం ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టమౌతోంది. కరువు మండలాలను ప్రకటించటానికే చాలాకాలం పట్టింది. తీవ్ర విమర్శల మధ్య రాష్ట్రంలో 670 మండలాలకుగాను 196 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించింది. దీనిపైనా తీవ్రవ్యతిరేకత వ్యక్తంకావటంతో మరికొన్ని మండలాలను చేరుస్తామని ప్రకటించింది.
ఉపాధిపనులు కల్పించి వలసలను నివారించలేకపోయింది. త్రాగునీరు, పశుగ్రాసం కూడా సరఫరా చేయలేకపోయింది. గత సంవత్సరం పంటలు కోల్పోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు 692.67 కోట్లు మంజూరుచేసినట్లు చెప్పినా, రైతుల ఖాతాల్లోకి వెళ్ళింది మాత్రం 188 కోట్లు మాత్రమే. మిగిలిన సొమ్ము రాష్ట్ర ఖజానాలో మూల్గుతున్నదే తప్ప, ఇప్పటివరకు రైతులకు అందలేదు. కేంద్రాన్ని 1924 కోట్లు సహాయం కోరగా 237.51 కోట్లు మాత్రమే మంజూరు అయింది. ప్రస్తుత సంవత్సరం జాతీయ ప్రకృతివైపరీత్యాల క్రింద కేంద్రం రెండు దఫాలుగా రూ. 330 కోట్లు విడుదలచేయగా, రాష్ట్ర సహాయనిధి క్రింద 110 కోట్లు వ్యయం చేయాల్సివుంది.

ఈ నిధులే తక్కువ అనుకొంటుంటే, వాటిని కూడా ఖర్చు చేయటంలేదు.

తెలంగాణా రాష్ట్రం కూడా సుదీర్ఘకాలం నుండి కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతోంది. ఈ సంవత్సరం అనేక జిల్లాలు కరువుతో అల్లాడుతున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో కురవాల్సిన దానికన్నా వర్షపాతం 20 శాతం తక్కువగా నమోదైంది. ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 41.43 లక్షల హెక్టార్లు కాగా, 35.13 లక్షల హెక్టార్లలో మాత్రమే పంటలు వేశారు. మరో 5 లక్షల హెక్టార్లలో వేసిన పంటలకు నష్టం వస్తుంది. బోరు బావుల క్రింద సాగుచేసిన 3.5 లక్షల హెక్టార్ల వరిపైరు దాదాపుగా ఎండిపోయింది. 443 గ్రామీణ మండలాలకు గాను 231 మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. త్రాగటానికి నీరు, తినటానికి ఆహారం దొరక్క పేదలు అల్లాడుతున్నారు. పశువులకు మేత దొరక్క అల్లాడుతున్నాయి. మహబూబ్‌నగర్, మెదక్, కరీంనగర్, రంగారెడ్డి, నల్గొండ, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయి. కరువు పనులు కల్పించటంలోనూ, వలసలు నివారించటంలోనూ, పంటలకు పరిహారం చెల్లించటంలోనూ టి.ఆర్.ఎస్ ప్రభుత్వం మొండిచేయి చూపింది.

మనదేశంలో 40 శాతంపైగా ప్రాంతంలో వరుసగా రెండో సంవత్సరం కరువు పరిస్థితి నెలకొని వుండగా, 18 రాష్ట్రాలకుగానూ కేవలం 7 రాష్ట్రాలు మాత్రమే ఆయా రాష్ట్రాలలోని 200 జిల్లాలను కరువు పీడిత జిల్లాలుగా ప్రకటించాయి. వాటిలో కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే కరువు నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి పంపి, తక్షణ కరువు సహాయక చర్యలు చేపట్టేందుకు నిధులు ఇవ్వవలసిందిగా కోరాయి. మిగిలిన రాష్ట్రాలు ఇంకా తమ ప్రాంతాల్లో కరువు పరిస్థితులను అంచనా వేస్తున్నాయట!. ఇది-కరువు పరిస్థితులతో విలవిల్లాడుతున్న రైతాంగ, ప్రజానీకంపట్ల పాలకుల క్రూర పరిహాసానికి నిదర్శనంగా వుంది.

ఐసిఏఇఆర్‌కు చెందిన అశోక్ గులాటి ఈ విధంగా పేర్కొన్నాడు : "గ్రామీణ దుర్భర పరిస్థితులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితులు రైతుల వెన్నెముకను విరిచేశాయి. ఉన్నతాధికారవర్గంతోసహా యావత్తు ప్రభుత్వమంతా ఈ నిస్తేజ స్థితినుండి క్రియాశీల స్థితికి చేరుకోవాల్సి వుంది"

అయితే దీనికి భిన్నంగా, కేంద్రం - రాష్ట్రాలు ఒకరిపై ఒకరు బాధ్యతను నెట్టివేసుకుంటూ, ఆరోపణలు చేసుకుంటూ కాలంగడుపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం - తాను గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిదినాలను పెంపు చేశానని; విత్తనాలకు, ఉద్యాన పంటలకు, పశుగ్రాసానికి సబ్సిడీలు ప్రకటించానని అంటూ, రాష్ట్ర ప్రభుత్వాలే ఇంకా కరువు నివేదికలు పంపలేదంటూ వాటిపై ఆరోపణలు చేస్తున్నది.

మరోవైపున రాష్ట్ర ప్రభుత్వాలు - కరువు తీవ్రతను, దాని వలన జరిగిన నష్టం యొక్క మోతాదును నివేదించినా, అందుకు తగిన నిధులు ఇవ్వమని కోరినా, సకాలంలో కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వటంలేదని పేర్కొంటున్నాయి. గత సంవత్సరం పంట నష్టానికి అడిగిన సహాయం, రెండు నెలల క్రితం మాత్రమే రాష్ట్రాలకు చేరింది. రాష్ట్రాలు కరువు పరిస్థితిని అతిగా అంచనావేసి పంపుతున్నాయని

కేంద్ర ప్రభుత్వం ఆరోపిస్తోంది. కాగా, కరువు పరిస్థితిని ఎదుర్కొనే నిధులు తగినంతగానూ, అదీ సకాలంలోనూ అందించటం లేదని రాష్ట్ర ప్రభుత్వాలు ఎత్తిచూపుతున్నాయి. కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల నడుమ మాటల యుద్ధం సాగుతూ వుంది. ఇది ఇలా సాగుతూ వుండగానే, నడుమ రైతాంగదుస్థితి కొనసాగుతూ, మరింత తీవ్రమౌతూ వారికి ఎలాంటి ఆశా కానరాకుంది.

ఇదంతా కరువునెదుర్కోవటంలో, తక్షణ సహాయ చర్యలు చేపట్టటంలో పాలకులు చూపుతోన్న ఉద్దేశ్య పూర్వక నిర్లక్ష్యంకాగా, ఇక కరువు నివారణకు అవసరమైన దీర్ఘకాల చర్యలవైపుగా పాలకులు దృష్టినే సారించటం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు – వ్యవసాయరంగానికి నిధులు పెంచి; నీటిపారుదల సౌకర్యాలను మెరుగుచేసి, బీడుభూములన్నింటికీ సాగునీటి సౌకర్యం కల్పించటం; పరిశోధనలు సాగించి, స్థానిక వాతావరణ పరిస్థితులకనుగుణమైన విత్తనాలను పెంపొందించు కోవటంతోపాటుగా, రైతాంగానికి దీర్ఘకాలిక సంస్థాగత రుణాలను అందచేయటమనే మౌలికచర్యలు చేపట్టాలి. వీటిలో ఏ ఒక్క చర్య తీసుకోవటానికీ ప్రభుత్వాలేవీ సిద్ధంగా లేవు. మనదేశ వ్యవసాయరంగాన్ని సామ్రాజ్య వాదుల ప్రయోజనాలకనుగుణంగా లోబరిచిన పాలకులు, ప్రపంచ వాణిజ్యసంస్థలో చేరటం ద్వారా సామ్రాజ్యవాద బహుళజాతి వ్యవసాయ వాణిజ్యసంస్థల వ్యాపార ప్రయోజనాలకనుగుణంగా వ్యవసాయరంగాన్ని మలచిన దుష్ఫలితమే, నేటి రైతాంగ దుస్థితికి కారణంగా వుంది. ఈ పరిస్థితులలో సామ్రాజ్యవాదుల ఆధిపత్యాన్ని ప్రతిఘటించటంతప్ప భారత రైతాంగానికి మరో మార్గంలేదు.

oooooo